క్లుప్తంగా

ఎరువుల దుకాణాల్లో ఏడీఏ తనిఖీలు



కొత్తకోట సహకార సొసైటీలో స్టాక్ రిజిస్టర్ పరిశీలిస్తున్న రామారావు

రావికమతం : రావికమతం, కొత్తకోట గ్రామాల్లో పలు ఎరువుల దుకాణాలు, ఎరువులు, విత్తనాలు విక్రయిస్తున్న సొసైటీలలో వ్యవసాయశాఖ ఏడీఏ రామారావు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాలు, సొసైటీల స్టాక్ రికార్డులు పరిశీలించారు. ఈ పాస్ మిషన్లు పనిచేస్తున్నదీ, లేనిదీ తెలుసుకున్నారు. గడవు మీరిన పురుగు మందులు విక్రయించ రాదని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయన వెంట రావికమతం ఇన్‌చార్జి వ్యవసాయాధికారి విజయలక్ష్మి కూడా ఉన్నారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై సమీక్ష



టి.అర్జాపురం పాఠశాలలో సమీక్ష నిర్వహిస్తున్న స్వామి

రావికమతం : పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు పిల్లల విద్యా స్థాయి, పాఠశాల అభివృద్ధికి పేరెంట్స్ కమిటీ తీసుకుంటున్న చర్యలపై స్టేట్ రిసోర్స్ పర్సన్ ఎంవీ స్వామి బుధవారం పలు పాఠశాలల్లో సమీక్ష నిర్వహించారు. ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులతో సమావేశమై పలు అంశాలను వివరించారు. ప్రతి పాఠశాల కమిటీ సభ్యులు గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించి వారిచ్చిన సలహాలు, సూచనలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి జయలక్ష్మి పాల్గొన్నారు.

పీఎం కిసాన్ ఈకేవైసీ గడువు 30



వ్యవసాయాధికారి వాసుదేవరావు

మాడుగుల : పీఎం కిసాన్ 14వ విడత నిధులు రైతుల ఖాతాల్లో జమ కావాలంటే ఈ నెల 30లోపు ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయాధికారి వాసుదేవరావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 13,520 మంది రిజిస్టర్డ్ రైతుల్లో ఇప్పటి వరకు 11,920 మంది ఈకేవైసీ చేయించుకున్నట్టు వెల్లడించారు. మిగిలిన 1,600 మంది కూడా త్వరితగతిన ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని సూచించారు. దగ్గర్లో ఉన్న మీ సేవ, ఆర్బీకే కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకోవచ్చన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవం



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అనురాధ, తదితరులు

కె.కోటపాడు : కింతాడ శివారు రామచంద్రపురం గ్రామస్తులు ఆంజనేయస్వామి తీర్థమహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. తీర్థం సందర్భంగా ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆంజనేయ స్వామి ఆలయంలో ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనురాధ ప్రత్యేక పూజలు జరిపారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తా

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట : ప్రజా సమస్యలను ప్రణాళికాయుతంగా పరిష్కరించి, అన్ని గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. బుధవారం బుచ్చెయ్యపేట మండలం పొట్టిదొరపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైనవారందరికీ సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అవినీతికి తావు లేకుండా నేరుగా తమ బ్యాంక్ ఖాతాల్లోనే సంక్షేమ పథకాల నగదు జమ అవుతోందని స్థానికులు ఆనందంగా వెల్లడించారు. గత ప్రభుత్వం కంటే జగనన్న ప్రభుత్వంలోనే తమకు ఎక్కువ ప్రయోజనం కలిగిందని పలువురు తమ ఆనందాన్ని ధర్మశ్రీ వద్ద వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మోసగాళ్లంతా కట్టగట్టుకుని బూటకపు హామీలు గుప్పిస్తారని తెలిపారు. వారి మోసాలకు చెంపపెట్టు మాదిరి రానున్న ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు.

స్థానిక నాయకులు, ప్రజల వినతుల మేరకు ఒడ్డు అప్పలనాయుడు ఇంటి నుంచి డలబంద వరకు, ఎస్సీ కాలనీ నుంచి బీఎస్ రోడ్డు వరకు, ఒడ్డు రాము ఇంటి నుంచి బీఎస్ రోడ్డు వరకు సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. లూలూరు పెదకట్టు చెరువు వద్ద కల్వర్టు నిర్మాణానికి కృషి చేస్తానని గ్రామస్తులకు భరోసానిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కె అచ్చింనాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, సర్పంచ్ దరిమిశెట్టి యశోద అప్పలనాయుడు, ఉప సర్పంచ్ గుద్దేటి శ్రీను, పార్టీ నాయకులు దరిమిశెట్టి మహాదేముడు, రమణ, గండెం రాజు, శిరిసోల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



లూలూరు పెదకట్టు చెరువు వద్ద కల్వర్టు నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న విప్ ధర్మశ్రీ

మెరుగైన వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్



సోమకేశవరావుకు చెక్కును అందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్ : ఆరోగ్యశ్రీ వర్తించని వారికి సీఎం జగన్ పెద్ద మనసుతో మెరుగైన వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని ఎం.కోడూరుకు చెందిన చింత సోమకేశవరావుకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.లక్ష చెక్కును బుధవారం తారువ క్యాంప్ కార్యాలయంలో ఆయన అందించారు. సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరయ్యేందుకు కృషి చేసిన డిప్యూటీ సీఎంకు సోమకేశవరావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సంజీవరావు, పడాల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీతో ప్రభుత్వ సంస్థలు నాశనం'



అవురువాడలో కార్మికులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నరసింహమూర్తి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

మాడుగుల రూరల్ : ప్రజావ్యతిరేక, నిరంకుశ బీజేపీ ప్రభుత్వం నుంచి దేశాన్ని కాపాడుకోవాలని సీపీఎం, సీపీఐ నేతలు పిలుపునిచ్చారు. వామపక్ష పార్టీల ప్రచారభేరీ కార్యక్రమం బుధవారం అవురువాడలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం ఐదవ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.నరసింహమూర్తి మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 30 వరకు తలపెట్టిన కార్యక్రమంలో భాగంగా ఊరూరా ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ప్రచారం చేస్తున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రయివేట్ యాజమాన్యాలకు అనుకూలంగా, కార్మికులకు వ్యతిరేకంగా సవరించిన లేబర్ కోడ్‌లను రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన ప్రైవేటీకరణ విధానాలను ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు కె.భవాని మాట్లాడారు.

మాకవరపాలెం : కేంద్ర ప్రభుత్వ విధానాలతో ప్రభుత్వ రంగ సంస్థలు నాశనమయ్యాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి.సత్తిబాబు, మండల కార్యదర్శి పాలపర్తి తాతబ్బాయి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై బుధవారం మండల కేంద్రంలో ప్రచారభేరీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. మతోన్మాద, ప్రజావ్యతిరేక, రైతు, కార్మిక వ్యతిరేక బీజేపీని గద్దె దింపాలని నినాదాలు చేశారు. బీజేపీ నుంచి దేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- తురకలపూడి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ప్రమాణస్వీకారంలో విప్ ధర్మశ్రీ



ధర్మశ్రీని, నాగభూషణంను జ్ఞాపికతో సత్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

బుచ్చెయ్యపేట : రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. బుచ్చెయ్యపేట మండలం తురకలపూడి కోఆపరేటివ్ పర్సన్ ఇన్‌చార్జిగా బుదిరెడ్డి నాగభూషణంను ప్రభుత్వం నియమించిన విషయం తెలసిందే. రైతు సంఘ నాయకుల సమక్షంలో బుధవారం ఆయన తురకలపూడిలో ప్రమాణస్వీకారం చేసి, బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విప్ ధర్మశ్రీ మాట్లాడుతూ రైతులు అవస్థలు పడరాదనే గ్రామాల్లోనే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఇతర సౌకర్యాలందేలా రైతు భరోసా కేంద్రాలను సీఎం జగన్ ఏర్పాటు చేశారని తెలిపారు. వ్యవసాయ పెట్టుబడుల కోసం ప్రతి సంవత్సరం రైతుకు రూ.13,500 నగదు అందించడమే కాక, కోఆపరేటివ్ సొసైటీల ద్వారా వ్యవసాయ రుణాలను సకాలంలో అందించి ఆదుకుంటున్నారని కొనియాడారు. ఎకరం పొలం ఉన్న రైతుకు కూడా గతం కంటే ఎక్కువ రుణ సౌకర్యం కల్పిస్తూ, ఆర్బీకేల ద్వారా రాయితీ ధరలకే వ్యవసాయ పరికరాలు, ఇతర సబ్సిడీలు అందిస్తున్నామన్నారు.

కార్యక్రమంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన పర్సన్ ఇన్‌చార్జి నాగభూషణంతో పాటు ప్రభుత్వ విప్ ధర్మశ్రీని విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు కె అచ్చింనాయుడు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, కోఆపరేటివ్ మాజీ అధ్యక్షులు మరిసా అప్పలనాయుడు, కోరుకొండ అప్పలనాయుడు, కుంచం ప్రకాశరావు, సర్పంచ్ యర్రంశెట్టి గోవింద, మాజీ సర్పంచ్ గట్ల అప్పలనాయుడు, పలువురు రైతు సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు.

ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధం



సిబ్బందికి సూచనలిస్తున్న మోహన్‌రావు

మాకవరపాలెం : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధం కావాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు సచివాలయ వ్యవసాయ సహాయకులకు సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌కు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. రైతు భరోసాకు రైతులందరూ దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

- ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు



ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

నాతవరం : వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా బోర్లు, రక్షిత మంచినీటి పథకాల మోటార్ల మరమ్మతులకు రూ.5 లక్షల విలువైన సామగ్రిని సిద్ధం చేసినట్టు ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 470 బోర్లు, 135 తాగునీటి పథకాలు, కొండలపై, గిరిజన గ్రామాల్లో పదికిపైగా సోలార్ సిస్టమ్ బోర్లు ఉన్నాయన్నారు. వాటితో పాటు తాండవ నదిలో చిక్కుడుపాలెం వద్ద 16 గ్రామాలకు తాగునీరు అందించేందుకు పైలట్ ప్రాజెక్టు పనిచేస్తోందన్నారు. వేసవిలో వీటిలో ఏవైనా మరమ్మతులకు గురైతే యుద్ధ ప్రాతిపదికన బాగు చేసేందుకు సామాగ్రిని కార్యాలయంలో సిద్ధంగా ఉంచినట్టు పేర్కొన్నారు. తాగునీటి సమస్య ఎక్కడున్నా, తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు. జల్ జీవన్ మిషన్ పథకంలో రూ.10 కోట్లతో పలు పంచాయతీల్లో ఇంటింటికీ కుళాయి పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ పనుల్ని సకాలంలో పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన గ్రామాల్లో సచివాలయం ఒక్కంటికి రూ.20 లక్షల చొప్పున చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నాయన్నారు. నాతవరం సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.40 లక్షలతో పనులు చేయాల్సి ఉందన్నారు.

ప్రజల చెంతకే.. ఫ్యామిలీ డాక్టర్



గొల్లలపాలెంలో వైద్య పరీక్షలను చేస్తున్న వైద్యాధికారి నిర్మల, సిబ్బంది



ఎన్‌జీ నగరంలో వైద్య సేవలందిస్తున్న వేచలం పీహెచ్‌సీ వైద్యాధికారి హారిక

కె.కోటపాడు : ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో గ్రామాల్లో ప్రజల చెంతకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నట్టు చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల అన్నారు. గొల్లలపాలెం గ్రామంలో బుధవారం 114 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. వైద్యంను పొందేందుకు ఆస్పత్రికి వెళ్లలేని స్థితిలో ఉన్న ఏడుగురి ఇళ్లకు వెళ్లి వైద్యాధికారి నిర్మల వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో భరోసా నింపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాము, రమణ, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్ : కె.జె.పురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వైద్యాధికారి లీలాప్రసాద్ 75 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను అందించారు. బీపీ, సుగర్ పరీక్షలతో పాటు గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కామేశ్వరి, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవరాపల్లి : ప్రజల చెంతకు వైద్యాన్ని చేరువ చేసిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని వేచలం పీహెచ్‌సీ వైద్యాధికారి బి.హారిక అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎన్‌జీ నగరంలో బుధవారం 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వారింటికే వెళ్లి, పరీక్షించి, మందులు అందించారు.

ఇన్‌చార్జి తహసీల్దారుగా కనకారావు



తహసీల్దార్ కనకారావు

నాతవరం : నర్సీపట్నం మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పి.కనకారావుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ బుధవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కనకారావు నాతవరం తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. జిల్లాల విభజన తర్వాత అనకాపల్లిలోని 24 మండలాల్లో ప్రభుత్వ పరమైన సేవలు అందించడంలో నాతవరం తహసీల్దార్ కనకారావు ప్రతిభ చూపించారు. దీంతో ఈ నెల 6న కలెక్టరు రవి పట్టాన్‌శెట్టి చేతులు మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఇపుడు జిల్లాలో కీలకమైన నర్సీపట్నం మండల బాధ్యతలు కూడా ఆయనకే అప్పగించడం గమనార్హం. త్వరలోనే ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

జీసీసీ డిపో సేల్స్‌మన్‌గా సత్యనారాయణ

రావికమతం : జీసీసీ కల్యాణపులోవ డిపో సేల్స్‌మన్‌గా ఎల్.సత్యనారాయణను నియమిస్తూ జిల్లా కలెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన సేల్స్‌మన్ అనారోగ్యం బారిన పడి, రేషన్‌ను సక్రమంగా అందించకపోవడంతో గిరిజనులు పలుమార్లు ఆందోళనకు దిగారు. దీనిపై తహసీల్దార్ మహేశ్వరరావు విచారణ జరిపి, అతనిపై 6ఎ కింద కేసు నమోదు చేశారు. ఈ మేరకు నూతన సేల్స్‌మన్‌గా సత్యనారాయణను నియమిస్తూ ఉత్తర్వులు వచ్చినట్టు కల్యాణపులోవ సర్పంచ్ వంజరి గంగరాజు బుధవారం తెలిపారు.

క్షయ రోగులకు పౌష్టికాహారం

మాడుగుల రూరల్ : క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం నుంచి ప్రతి నెల అందించే ఆర్థిక సాయంతోపాటు, దాతలు సమకూర్చిన పౌష్టికాహారాన్ని బుధవారం కె.జె.పురం పీహెచ్‌సీ వద్ద పంపిణీ చేశారు. చోడవరం, మాడుగుల మండలాలకు చెందిన టీబీ, ఎంటీసీ రోగులు 22 మందికి పెదగోగాడ పీహెచ్‌సీ వైద్యాధికారి దాడి అప్పారావునాయుడు, స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి శివప్రసాదుపాత్రుడు ఆధ్వర్యంలో ఆయిల్, శనగపలుకులు, కొమ్ముశనగ, బెల్లం, రాగి పిండి, గోధుమ పిండి, పెసరపప్పు, శనగపప్పు తదితర సరకుల్ని అందించారు. దాతల ఆర్థిక సాయంతో జిల్లా క్షయ నివారణాధికారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి వీటిని సమకూర్చినట్టు వైద్యాధికారులు తెలిపారు. స్థానిక సర్పంచ్ జామి రమణబాబు, పీఏసీఎస్ అధ్యక్షులు కాళ్ల రాము, ఉప సర్పంచ్ కాళ్ల కోటమ్మ, జగన్‌తోపాటు టీబీ సూపర్‌వైజరు కె.ఈశ్వరావు, ఎంపీహెచ్‌ఈవో రవికుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రోలుగుంట : ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు మండలంలోని కుసుర్లపూడి, రోలుగుంట తదితర గ్రామాలను బుధవారం సందర్శించారు. కుసుర్లపూడి పర్యటనలో గ్రామానికి చెందిన బీజేపీ మండల శాఖ కార్యదర్శి పచ్చిగోళ్ల ఈశ్వరరావు గ్రామంలోని కాలువల్లో పూడిక పేరుకుపోయి, దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని ఈవోపీఆర్డీ దృష్టికి తీసుకెళ్లారు. దోమల వ్యాప్తిని అరికట్టాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ సత్వరమే దీని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

సారా తయారీదారులపై బైండోవర్ కేసులు

మాడుగుల రూరల్ : మండలంలోని వివిధ గ్రామాల్లో నాటుసారా తయారు చేసే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు స్థానిక తహసీల్దార్ పి.వి.రత్నం తెలిపారు. స్థానిక సెబ్ వారు కేసులు నమోదు చేసిన నాటు సారా తయారీదార్లను తహసీల్దారు ముందు బుధవారం హాజరుపరిచారు. మండలంలోని ఒమ్మలి, లోవగవరవరం, గొప్పులపాలెం, కృష్ణంపాలెం, మాడుగుల గ్రామాలకు చెందిన వీరిపై తహసీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటుసారా తయారుచేయొద్దని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవట్లేదని, దీని వల్ల మీ కుమారుల భవిష్యత్ కూడా నాశనం అవుతుందని హెచ్చరించారు.

శిశువులకు ఆధార్ నమోదు

రోలుగుంట : కంచుగుమల గ్రామంలో బుధవారం శిశు ఆధార్ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు చిన్నారులను తీసుకువచ్చి, ఆధార్ నమోద చేయించుకున్నారు. ఆధార్ సెంటర్ నిర్వాహకుడు నాయుడు వారి నుంచి ధ్రువపత్రాలను తీసుకుని, ఆధార్ నమోదు చేయించారు. అనంతరం గ్రామానికి చెందిన 80 మందికి నూతన ఆధార్ కార్డులు జారీ చేశారు. గత పదేళ్లలో ఆధార్ అప్‌డేట్ చేయించుకోనివారు వెంటనే అప్‌డేట్ చేసుకోవాలని కోరారు. తమ గ్రామంలోనే ఆధార్ శిబిరం ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

'ఫ్లెక్సీలు తొలగించేలా చర్యలు తీసుకోండి'

మాకవరపాలెం : గ్రామాల్లో రాజకీయ నాయకులు ఏర్పాటు చేసే ఫ్లెక్సీలను వీలైనంత వేగంగా తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కార్యదర్శులు, వీఆర్వోలకు ఎస్ఐ రామకృష్ణారావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభలు, సమావేశాలు, ఇతర ప్రైవేటు కార్యక్రమాలకు సంబంధించి నాయకులు ఏర్పాటు చేసే ఫ్లెక్సీలను ఆయా కార్యక్రమాల అనంతరం తొలగించాలన్నారు. ఎక్కువ రోజులు వాటిని ఉంచితే రాజకీయ గొడవలకు దారితీస్తాయన్నారు. ఇదే విషయాలపై స్థానికంగా ఉన్న అన్ని రాజకీయ పార్టీల నేతలతో సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించాలన్నారు. నాయకులు తొలగించకుంటే పంచాయతీ అధికారులే తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణశ్రీ పాల్గొన్నారు.

ఇంటర్లో మెరిసిన ప్రైవేట్ విద్యార్థులు



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న శ్రీవిద్య కళాశాల కరస్పాండెంట్ సత్యవేణి



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీప్రగతి కరస్పాండెంట్ సత్తిబాబు, ప్రిన్సిపాల్ బాబ్జి

నర్సీపట్నం : ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు సత్తా చాటారు.

- ద్వితీయ ఇంటర్ ఫలితాల్లో శ్రీప్రగతి జూనియర్ కళాశాలకు చెందిన ఎస్.షరిష్మ(988 బైపీసీ), పి.ప్రవళిక(987 ఎంపీసీ), ప్రథమ ఇంటర్లో సీహెచ్ కోటిలోకతేజ(464 ఎంపీసీ), శ్రావణి(424 బైపీసీ) అత్యధిక మార్కులతో ప్రతిభ కనబరిచారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ సత్తిబాబు, ప్రిన్సిపాల్ ఎ.బాబ్జి, డైరెక్టర్లు అభినందించారు.
- శ్రీవిద్య జూనియర్ కళాశాల నుంచి ద్వితీయ ఇంటర్లో జి.భువనేశ్వరి(986 బైపీసీ), డి.వైష్ణవి(985 ఎంపీసీ), ప్రథమ ఇంటర్ ఎంపీసీలో ఎల్.హరిశంకర్ సాయివినయ్ 464 మార్కులు సాధించగా, మరో 19 మంది 900కు పైగా మార్కులు సాధించారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ గాడి సత్యవేణి, డైరెక్టర్ బోశం దొరబాబులు అభినందించారు.
- ఇంటర్ ఫలితాల్లో ఏబీఎం జూనియర్ కళాశాలలో ద్వితీయ ఇంటర్లో కె.శ్యామల(936 బైపీసీ), ఆర్.తనూజ(927 బైపీసీ), ప్రథమ ఇంటర్లో బి.భార్గవి(454 ఎంపీసీ), పి.చంద్రతేజస్విని(445 ఎంపీసీ), వెటర్నరీలో ఫస్టియర్ ఎస్.చంద్రకళ(452), ఎస్.దివ్యకుమారి(450), బి.లీలామంగావతి(446) మార్కులు సాధించారు. వీరిని కరస్పాండెంట్ గిరిబాబు, అధ్యాపకులు అభినందించారు.
- రవితేజ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించారు. ద్వితీయ ఇంటర్లో కె.లక్ష్మీకావ్య(983 ఎంపీసీ), ఎం.రేణుక(964 బైపీసీ), ప్రథమ ఇంటర్లో ఎం.శ్రీజ(453), బి.లోకేశ్వరి(411 బైపీసీ) మార్కులు సాధించారు. వీరిని కరస్పాండెంట్ మోహనానంద, డైరెక్టర్ రాజునాయుడు, ప్రిన్సిపాల్ అచ్చియ్యనాయుడు అభినందించారు.
- ఇంటర్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన శ్రీకృష్ణ జూనియర్ కళాశాల విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ దేవాడ బంగారునాయుడు, అధ్యాపకులు అభినందించారు. సెకండియర్ ఎంపీసీలో అడిగర్ల పల్లవి(987), బైపీసీలో వై.దివ్య(973) ప్రతిభ కనబరిచారు.
- డా.రాజేంద్రప్రసాద్ జూనియర్ కళాశాలకు చెందిన పి.వి.రేవతి(981 ఎంపీసీ), బైపీసీలో పి.మాధురి(972), ఎం.శ్రీలక్ష్మి(971), ఇ.మాధవి(971), ఫస్టియర్లో బైపీసీలో ఎస్.కాత్యాయణి(434), జి.భవాని(433), ఎంపీసీలో పి.వరమ్మ(459), కె.దివ్యభవాని(455) ప్రతిభ చూపారు. వీరిని కరస్పాండెంట్ పి.నాగరాజు, ప్రిన్సిపాల్ ఎ.గోపాలరావు అభినందించారు.